



తాడిహత్నూర్ వద్ద ప్రేమ్‌సింగ్ మహరాజ్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

కదిలిన సేవాలాల్ దండు

- శంకర్‌లొద్ది నుంచి ప్రారంభమైన భక్తుల పాదయాత్ర

ఉట్నూర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): బంజారాల దీక్షగురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ దీక్ష భూమి శంకర్‌లొద్ది నుంచి మహారాష్ట్రలోని పౌరగడ్‌కు సేవాలాల్ భక్తుల పాదయాత్ర ప్రారంభం అయ్యింది. కొత్తపల్లి దీక్ష భూమి గురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో మూడు వేలకు పైగా సేవాలాల్ భక్తులు దండుగా కదిలారు. ఉమ్మడి జిల్లాలోని కెరమెరి మండలం శంకర్‌లొద్ది దీక్ష భూమి నుంచి ఉగాది పర్వదినం పురస్కరం చుకుని ప్రారంభమైన సేవాలాల్ భక్తుల పాదయాత్ర సోమవారం ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్డుకు చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రితేష్ ఆధ్వర్యంలో పాదయాత్రగా తరలి వచ్చిన సేవాలాల్ భక్తులకు పండ్లు అందించి తాగునీటి సౌకర్యం కూడా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సింగ్ మహరాజ్ మాట్లాడుతూ ఉగాది పర్వదినం నుంచి ప్రారంభమైన సేవాలాల్ భక్తుల పాదయాత్ర పోరాగడ్‌కు శ్రీరామ నవమి రోజున చేరుకుంటుందని వివరించారు. ఇందులో మాజీ ఎంపీపీ ఆడే దండాల్ నాయక్, అన్నెడ మల్లారెడ్డి, నాగభూషణం, బింగ వెంకటేశ్, సాడిగే రాజేశ్వర్, హరినాయక్, నరేందర్, బొడ్డు కిరణ్, జాదవ్ చంద్రకాంత్, వసంతరావు, మోహన్ నాయక్, ప్రకాష్ రాథోడ్, మురళీ జాదవ్, పవార్ వినోద్‌కుమార్, సీతారామ్ పవార్, నరహరి, దుప్ప నాయక్, భక్తులు వేలాది మంది సంఖ్యలో పాల్గొన్నారు.

- తాడిహత్నూర్‌లో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి(హెచ్) గ్రామంలో ఉన్న బంజారా ఆరాధ్య దైవం దీక్ష భూమి గురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ సోమవారం మహారాష్ట్ర పౌర దేవి వరకు రెండు వేలకు పైగా ఉన్న సేవలాల్ దీక్ష పరుల మహా సంకల్ప పాదయాత్రను పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర, ఛత్తీస్ ఘడ్, కేరళ, తమిళనాడు మధ్యప్రదేశ్ ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున్న భక్తులు పాల్గొన్నారు. ఎండల దృష్ట్యా దీక్షపరులకు రోడ్డు ప్రయాణ సందర్భంగా తాడిహత్నూర్ గ్రామం శివాజీ చౌక్ వద్ద గ్రామ ప్రజలు, మాజీ సర్పంచ్, నాయక్, కారోబారి, డావ్, శ్రీ సంత సేవాలాల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కిషోర్ చవాన్, మునిరాం చవాన్, జాదవ్ ఆనందరావు, పరుశురాం, రాథోడ్ గణేష్ తదితరులు యాత్రికులకు అల్పాహార విందు ఏర్పాట్లు చేశారు.



- పొన్నారి గ్రామ పంచాయతీ కార్యాలయం

పంచాయతీలకు.. నిధుల కటకట!

- జిల్లాలో గత ఏడాది కాలంగా చెల్లించని ట్రాక్టర్ వాయిదాలు
- పేరుకుపోయిన రూ.3 కోట్ల 15 లక్షల 9318 బకాయిలు
- నిర్వహణ భారంతో చేతులెత్తేస్తున్న కార్యదర్శులు
- నిధులు లేక పల్లెపాలనపై నిండు నిర్లక్ష్యం
- జిల్లావ్యాప్తంగా బ్యాంకు రుణం కింద ట్రాక్టర్, ట్రాలీలను కొనుగోలు చేసిన 423 పంచాయతీలు

ఆదిలాబాద్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రగతిని పరుగులు పెట్టించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. అయితే, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పంచాయతీలను నిధుల కటకట వెంటాడుతోంది. దీంతో గ్రామాల్లో ఎలాంటి పనులను చేపట్టలేని పరిస్థితి ఉందని అధికారులు వాపోతున్నారు. గత ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ ట్రాలీ, నీటి ట్యాంకర్లను అందించింది. నిధులు అందుబాటులో ఉన్న కొన్ని పంచాయతీలు నగదును చెల్లించి ట్రాక్టర్ ట్రాలీ, నీటి ట్యాంకర్‌ను కొనుగోలు చేశాయి. చాలా గ్రామ పంచాయతీలు మాత్రం వాయిదాల పద్ధతిలో బ్యాంకు రుణం కింద ట్రాక్టర్ ట్రాలీని కొనుగోలు చేశారు. గత రెండు, మూడేళ్లుగా అడపదడప నిధులు రావడంతో ట్రాక్టర్ వాయిదాలను చెల్లిస్తూ వస్తున్నారు. అయితే గత ఏడాది క్రితమే పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసిపోయింది. దీంతో అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అప్పటి నుంచి పంచాయతీల పాలన ముందుకు పడడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో 468 గ్రామ పంచాయతీలకు గాను 423 గ్రామ పంచాయతీలు బ్యాంకు రుణం కింద ట్రాక్టర్, ట్రాలీలను కొనుగోలు చేశాయి. ఇప్పటి వరకు 44 గ్రామ పంచాయతీలు తీసుకున్న రుణాను తిరిగి చెల్లించాయి. రెండు గ్రామ పంచాయతీలు మాత్రమే సక్రమంగా వాయిదాలను చెల్లిస్తూ వస్తున్నాయి. మిగితా 377 గ్రామ పంచాయతీలు గత ఏడాది కాలంగా బ్యాంకు వాయిదాలను చెల్లించకుండానే చేతులెత్తేయడంతో ఓవర్ డ్యూ బకాయిలు కనిపిస్తున్నాయి.

బ్యాంకు అధికారుల హెచ్చరికలు

బ్యాంకు రుణంతో ట్రాక్టర్ ట్రాలీని కొనుగోలు చేసిన గ్రామ పంచాయతీలు సక్రమంగా వాయిదాల కిస్తీలను చెల్లించక పోవడంతో రూ.లక్షల్లో బకాయిలు కనిపిస్తున్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీ రూ.50 వేల నుంచి రూ.లక్షకు పైగా బ్యాంకులకు బాకీ పడినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. జిల్లాలో మొత్తం రూ.3 కోట్ల 15 లక్షల 9318 బ్యాంకులకు చెల్లించాల్సి ఉందంటున్నారు. ఇప్పటికే కొన్ని పంచాయతీలను ఎన్‌పీఏ కింద పరిగణిస్తున్నట్లు తెలుస్తుంది. సక్రమంగా వాయిదాలు చెల్లించని గ్రామ పంచాయతీలకు బ్యాంకు అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు. అయితే అందుబాటులో నిధులు లేకపోవడంతోనే చెల్లించలేని పరిస్థితి ఉందని పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. నిధులు ఎప్పుడు వస్తాయో? కూడా తెలియని పరిస్థితి ఉందని చెబుతున్నారు. నెలల తరబడి వాయిదాలు చెల్లించక పోవడంతో బ్యాంకుల్లో తీసుకున్న రుణంతో పాటు వడ్డీ విపరీతంగా పెరిగి పోతోంది. దీంతో గ్రామ పంచాయతీలపై అదనంగా భారం పడే అవకాశం ఉందంటున్నారు. పంచాయతీ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తు ఇతర ఖాతాల్లో సిబ్బంది వేతనాలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం జమ చేస్తోందని అధికారులు చెబుతున్నారు.



పొన్నారి గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్



భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామ పంచాయతీ ట్రాక్టర్

నిధులు లేకనే వాయిదాలను చెల్లించడం లేదు

: శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్



ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాక పోవడంతోనే ట్రాక్టర్ ట్రాలీల వాయిదాలను చెల్లించలేక పోతున్నాం. గత కొద్దిరోజులుగా ఎలాంటి నిధులు రావడం లేదు. దీంతో పంచాయతీ ఆదాయంతోనే నెట్టుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎప్పుడు నిధులు వస్తాయో? కూడా తెలియదు. బ్యాంకు అధికారులు తరచు ఫోన్ చేస్తున్నా సర్దిచెప్పాల్సి వస్తుంది. అడపదడప మల్టీపర్పస్ వర్కర్లకు మాత్రమే వేతనాలు వస్తున్నాయి.

డీజిల్ ఖర్చులకు తిప్పలే..

గ్రామాల్లో చెత్త సేకరణకు నిత్యం ట్రాక్టర్ ట్రాలీని నడపాల్సి ఉంటుంది. దీని కోసం పంచాయతీ కార్యదర్శులు జేబులో నుంచి ఖర్చు చేస్తూ డీజిల్‌ను కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. డీజిల్ బకాయిలు కూడా భారీగా పెరుగుతున్నాయని వాపోతున్నారు. కొన్ని మేజర్ గ్రామ పంచాయతీల్లో సక్రమంగా ట్యాక్స్ వసూళ్లు, ఇతర అనుమతుల పేరిటా కొంత ఆదాయం వస్తున్నా.. చిన్న గ్రామ పంచాయతీల్లో మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని సమయాల్లో అప్పు చేసి మరి డీజిల్‌ను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందంటున్నారు. ఏదైనా మరమ్మతులు

(తరువాయి 6వ పేజీలో...)

'రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తుల ఆహ్వానం'

ఉట్నూర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మరియు ఈడబ్ల్యుఎస్ (ఈడబ్ల్యుఎస్/ఈబీసీ) వర్గాలకు స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా రీజివ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు. ఈ పథకానికి ఆర్థిక పరిమితులు గమనించాలన్నారు. సంవత్సర ఆదాయం రూ.1.50 లక్షలలోపు కలిగి ఉండాలని, ఈ పథకంలో భాగంగా ఆయా వర్గాల యువతీ, యువకులు 21 ఏళ్ల నుంచి 55 ఏళ్ల వయస్సు (వ్యవసాయేతర పథకాలకు), 21 నుంచి 60 సంత్సరాల వయస్సు (వ్యవసాయ మరియు అనుబంధ పథకాలకు) కలిగిన వారు ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరకాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత దరఖాస్తును ప్రింట్ తీసుకుని కావాల్సిన అన్ని పత్రాలు జత చేసి వారి వారి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కానీ, ఎంపీడీవో కార్యాలయంలో ఏప్రిల్ 5వ తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలి : ఎమ్మెల్యే

నేరడిగొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు అధ్యాత్మికతలో పాల్గొనాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఎనిమిదవ వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలలో ప్రతినిత్యం పూజలు చేయడం వల్ల కుటుంబాల్లో సుఖ శాంతులు నెలకొంటాయన్నారు. అనంతరం మహా అన్నదాన ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం శబరిమాత భక్తుల పాదయాత్ర

ఆదిలాబాద్ రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పురస్కరించుకొని బాలయ్య మహరాజ్, దేవన్న మహరాజ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుంచి శబరిమాత భక్తులు పాదయాత్ర చేపట్టారు. కాలినడకన కామారెడ్డి జిల్లాలోని తాడ్వాయి గ్రామంలో వెలసిన శబరి మాత ఆలయాన్ని దర్శించుకొంటారని, ఆ తర్వాత అమ్మవారి ఆశీస్సులు పొందుతారని పేర్కొన్నారు. సోమవారం పాదయాత్ర ప్రారంభోత్సవంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. పాదయాత్ర విజయవంతం కావాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



ఇంద్రవెల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఉట్నూర్‌లోని ఈద్గా వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



నేరడిగొండలో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ - జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు - ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

ఇంద్రవెల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినం లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం రంజాన్ పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఇస్లాం శాంతి, ప్రేమ, దయా గుణాలను ప్రబోధిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని మతాలు, కులాలను సమానంగా చూస్తారన్నారు. తెలంగాణలో మైనారిటీలతో పాటు ప్రజలంతా సుఖశాంతులతో జీవిస్తున్నారని, అందరి భద్రతకు, సంక్షేమానికి సీఎం ప్రాధాన్యత నిస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: ఉట్నూర్ ఏజెన్సీలో సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి ఉట్నూర్ పట్టణంలోని దర్గా సమీపంలో ఉన్న ఈద్గా వద్దకు చేరుకుని మౌలాన కలీం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా ప్రత్యేక ఉపన్యాసాలు చేశారు. ప్రార్థనల అనంతరం ముస్లింలకు స్థానికులు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఆలింగనం చేసుకున్నారు. మండలంలని లక్కారం, ఉట్నూర్, దంతనపల్లి, బీర్సాయిపేట, షాంపూర్, తదితర ప్రాంతాల్లో ఉన్న ముస్లింలు నెల రోజుల పాటు దీక్షలో ఉండి సోమవారం రంజాన్‌ను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ, బీఆర్ఎస్ నాయకులు భరత్‌చౌహాన్, తదితరులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కాగా, వక్ఫ్ సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా ఉట్నూర్ మండలంలోని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు రంజాన్ పండుగా పురస్కరంచుకుని ముస్లింలు నల్ల రిబ్బన్లు ధరించి ఈద్గా వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడానికి ఈ చట్టం తేవడానికి చూస్తోందన్నారు.

- ఒకే ముస్లిం కుటుంబం.. ఊరంతా పండుగ

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఘనంగా రంజాన్ పండుగను జరుపుకున్నారు. గ్రామంలో ఒకే ముస్లిం కుటుంబం ఉన్నప్పటికీ.. ఊరంతా పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రసిద్ధి గాంచిన హస్సేన్ హుస్సేన్ దేవస్థానం ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు నిర్వహించడం జరిగిందని హసేన్ హుస్సేన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు మాజీ విజయ డెయిరీ చైర్మన్ లోకా భూమారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం సేమియా పాయసం చేసి హస్సేన్ హుస్సేన్ దేవుళ్లకు పూజలు నిర్వహించి ఇట్టి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చిన్న గోక వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి మోతి శ్రీనివాస్, దేవస్థానం కార్యదర్శి ఎల్పుల రామకృష్ణఫోర్త్‌క్లాస్ ఎంప్లాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండూరు గంగాధర్, పుండ్రు పోతారెడ్డి, నిట్టడి గంగాధర్, నిమ్మల సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రుయ్యాడి హసేన్ హుస్సేన్ ఆలయంలో సేమియా పాయసం వితరణ

నేరడిగొండ: మండలంలోని కబ్రస్థాన్ మైదానంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లు పాల్గొని ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ అన్నదమ్ముల వలే శాంతియుతంగా పండుగలను నిర్వహించుకోవడం గొప్ప విషయమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మాజీ ఎంపీపీ రాథోడ్, సుజన, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, యువకులు, తదితరులు ఉన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలల్లో అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఇచ్చోడ మండలంలోని మాధాపూర్ గ్రామంలో రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. రంజాన్ పండగ సందర్భంగా మాజీ ఎంపీ సోయం బాపురావ్ గ్రామంలో ఉన్న ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నిర్వహించిన సామూహిక ప్రార్థనలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

బోథ్: మండల కేంద్రంలో సోమవారం ముస్లిం సహోదరులు రంజాన్ పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలు ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక నమాజ్ గావించారు. ఈ సందర్భంగా ప్రార్థనల అనంతరం పండుగ శుభాకాంక్షలు ఒకరికొకరు తెలిపారు. కాగా స్థానిక ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. బందోబస్తు వచ్చిన పోలీసులతో ప్రార్థనలు చేసిన చిన్నారులు పోటీపడి ఫొటోలు తీసుకున్నారు.

భీంపూర్: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని మండలంలోని పిప్పల్ కోటి, నిపాని, గోన, వడూర్, అర్లి (టీ) తదితర గ్రామాలలో సోమవారం ఈదుల్ ఫితర్ రంజాన్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు .పిప్పల్ కోటిలోని ఈద్గాలో మౌలానా రంజని హఫీజ్ సహబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, సోదర భావం, శాంతి చిహ్నమే రంజాన్ పర్వదినం అన్నారు. ఆ అల్లాహ్ దయతో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధి గా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. భీంపూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గుడిహత్నూర్: మండలంలోని గుడిహత్నూర్, సీతాగోంది, కమలాపూర్, మన్నూర్, శాంతాపూర్, తోషం, సూర్యగూడ గ్రామాల్లో సోమవారం ముస్లీంలు రంజాన్ పండుగను ఘంగా నిర్వహించుకున్నారు. నూతన దుస్తులు ధరించి చిన్నాపెద్ద తేడా లేకుండా ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పరస్పరంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం గతించిన తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్దకు వెళ్లి నివాళులర్పించారు. ఈద్గాల వద్ద ప్రార్థలు చేయించి రంజాన్ ప్రాముఖ్యత గురించి వివరించారు.

(మరిన్ని వివరాలు 6వ పేజీలో...)



ఇచ్చోడలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బోథ్‌లో ఈద్గా వద్ద పోలీస్ అధికారులతో నమాజ్ చేసేందుకు వచ్చిన చిన్నారులు



ఆదిలాబాద్‌లో బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ

ఈద్ బందోబస్తును పరిశీలించిన ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లోని ఈద్గా వద్ద ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ కోసం ఏర్పాటు చేసిన బందోబస్తు ప్రక్రియను ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పర్యవేక్షించారు. ముందుగా ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా వద్ద ప్రశాంతంగా పవిత్ర ప్రార్థనలు ముగిసినట్లు పేర్కొన్నారు. బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, దాదాపు 40ఏళ్ల పాటు రాష్ట్ర పోలీసు వ్యవస్థకు నిరంతరాయంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ ఎస్సై చంద్రకాంత్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల సమక్షంలో ఏఆర్ ఏస్సైను ఎస్పీ సిబ్బందితో కలిసి శాలువా పూలమాలతో సత్కరించి బహుమతి ప్రధానం చేసి సాగనంపారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు.



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ముస్లింలకు ఈద్ శుభాకాంక్షల వెల్లువ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ముస్లింలకు ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఆదిలాబాద్ ఈద్గా మైదానం వద్ద ఈద్ నమాజ్ అనంతరం ముస్లింలకు ప్రముఖులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వారిలో మాజీ మంత్రి జోగు రామన్న, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి, మాజీ టీపీసీసీ కార్యదర్శి గండ్రత్ సుజాత, మైనార్టీ నేతలు సాజిద్ ఖాన్, యూనిస్ అక్బాని, తదితరులు ఉన్నారు.

● ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు

జైనథ్: ఉమ్మడి మండలంలోని బోరజ్, సాత్నాల, లేఖర్‌వాడ, నిరాల, దీపాయిగూడ, ఆనంద్‌పూర్, గిమ్మా, తదితర గ్రామాలతో పాటు మండల కేంద్రంలో సోమవారం రంజాన్ పండుగ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత నెల రోజులుగా చేపట్టిన ఉపవాస దీక్షలను విరమింపచేసి సమీప ఈద్గాల మసీదుల వద్ద సామూహిక ప్రార్థనలను నిర్వహించారు. ఖురాన్ గ్రంథ సారాంశాన్ని ఇమామ్‌లు చదివి వినిపించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు ధనం ధాన్యం, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, జైనథ్ ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రూకేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలో సోమవారం రంజాన్(ఈద్-ఉల్-ఫితర్) పర్వదిన వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గా వద్దకు చేరుకుని ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ పండుగ యొక్క విశిష్టతను వివరించారు. రంజాన్ ఉపవాస దీక్షలు మనలో క్రమశిక్షణ దాతృత్వం, ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. ప్రతీ వ్యక్తి దానగుణం కలిగి ఉండాలని, తనకు ఉన్నదాంట్లో దానం చేయడమే గొప్ప లక్ష్యంగా భగవంతుడు పేర్కొన్నారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ మహ్మద్ ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు.

తాంసి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున ఆయా గ్రామాలలోని మసీదుల వద్దకు వెళ్లి ముందుగా నమాజ్ చదివారు. అనంతరం హిందూ, ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆ తర్వాత ఈద్ ముబారక్ అంటూ ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. మొత్తం మీద తాంసి మండలంలో రంజాన్ పండుగ ఘనంగా జరిగింది.

నార్నూర్: మండలం మైనార్టీ సోదరులు రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలకు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం అంతా పండగ వేడుకలను సంతోషంగా జరపుకుంటారన్నారు. నెల మాసం పవిత్ర ప్రార్థనలతో అల్లాహ్ దీవెనలు పొందుతారన్నారు. ఉపవాస దీక్షలు చేయడం గొప్ప అంశం అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ జేఏసీ చైర్మన్ ఉత్తం రాథోడ్, దళిత రత్న అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే, వీటీడీఏ చైర్మన్ దిగాంబర్ ఆడె, కోఆర్డినేటర్ సికెందర్ రాథోడ్, అన్నబహు సాఠే, మండల అధ్యక్షుడు కొరెల మహేందర్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు గంజా చిన్న, సుభాష్ రాథోడ్, జాడే దయానంద, తదితరులు పాల్గొన్నారు.



జైనథ్‌లో ఎస్సై, సీఐలతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్



పోలీసులకు సలహాలు, సూచనలు అందజేస్తూ..

గ్రామ పోలీసు వ్యవస్థను పునః ప్రారంభించాలి

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

జైనథ్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా గ్రామాలలో విలేజ్ పోలీసు ఆఫీసర్ వ్యవస్థను తిరిగి పునః ప్రారంభించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన జైనథ్‌లో గల పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో గల రికార్డులను మరియు రికార్డు గది ఫిర్యాదుల విభాగాన్ని ఎస్పీ దగ్గర ఉండి పరిశీలించారు. ఈ సందర్భంగా జైనథ్ ఎస్ఐ, సీఐ పోలీసు సిబ్బంది పలు సూచనలు సలహాలను అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌నందు రికార్డులనిర్వహణ, నవీకరణ ప్రతీ రోజు నిర్వహించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతీ గ్రామానికి విలేజ్ పోలీసు ఆఫీసర్ కేటాయించి పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను పరిష్కరించే దిశగా చూడాలన్నారు. అన్ని గ్రామాలను ఎస్సై, సీఐ సందర్శించి సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్న తెలపాలని అన్నారు. మండలంలో ఉన్న రౌడీలపై రౌడీ షీట్లు ఏర్పాటు చేసి ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. గంజాయి నిర్మూలన, బ్లూకోర్టు, 100 డమల: పెట్రోలింగ్ వాటిపై పోలీసులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, జైనథ్ రూరల్ సీఐ డి.సాయినాథ్, జైనథ్ ఎస్సై వి.పురుషోత్తంలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



దేవాపూర్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు



నేరడిగొండలో నిరసన తెలుపుతున్న దృశ్యం

పలుచోట్ల వక్ఫ్ సవరణ బిల్లు పట్ల నిరసనలు

తలమడుగు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండంలోని దేవాపూర్ గ్రామంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం యువత అందరూ కలిసి వక్ఫ్ బోర్డు సవరణ బిల్ పట్ల నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా జరుగుతున్నదంటూ బిల్‌ను వ్యతిరేకిస్తూ రంజాన్ పండుగ రోజున నల్ల బ్యాడ్జిలతో ముస్లింలు అందరూ కలిసి నల్ల చట్టానికి వ్యతిరేకంగా అందరూ కలిసి చేతికి నల్లబ్యాడ్జితో నిరసన తెలిపారు. ఒంటరి కేంద్ర ప్రభుత్వం బిల్లును ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

నేరడిగొండ: వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా నాయకుడు మజర్ నల్ల కుర్త ధరించి తన కుటుంబ సభ్యులకు నల్ల బ్యాచ్‌లు కట్టి రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాకి చేరారు. ఈ సందర్భంగా మజర్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులపై ప్రధాని మోదీ కావాలని కుట్ర చేస్తున్నారని, అనేక పార్టీలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా ముస్లీంలను భంగం కలిగించేలా బిల్లును ప్రవేశపెట్టడం దుర్మార్గపు చర్య అని అన్నారు. ముసల్మాన్ చట్టం 1923, వక్ఫ్ చట్టం 1995ను సవరించాలని చూస్తున్న మోదీ 3.0 ప్రభుత్వంపై మండిపడ్డారు. దేశంలో అందరూ సామానులే అని, కాబట్టి బిల్లును వెనక్కి తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఇచ్చోడ: కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 8 2024న పార్లమెంట్‌లో ముస్లీంలకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు కట్టి రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గా పరిసరాలల్లో శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శాంతియుత నిరసనల్లో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారుఇచ్చోడ మండల కేంద్రంలో సోమవారం ఫ్లెక్సీలు, ఫ్లకార్డులతో పవిత్ర ప్రార్థనల అనంతరం ఈద్గా వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ ముస్లీం పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో ఈద్గా వద్ద నిరసన తెలుపుతున్న యువకులు

పంచాయతీలకు నిధుల కటకట!

(5వ పేజీ తరువాయి...)

వస్తే ట్రాక్టర్ ట్రాలీలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. దీంతో చెత్త సేకరణకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. మరో రెండు నెలల్లోనే వర్షాకాల సీజన్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఆలోగా పారిశుధ్య పనులను పూర్తి చేస్తేనే సీజనల్ వ్యాధుల ముప్పు తప్పేలా ఉందంటున్నారు. అలాగే ఉన్నతాధికారుల పర్యటనల్లోనూ పలు రకాల ఖర్చులు చేయాల్సి వస్తుంది. కనీసం చాయా, బిస్కెట్‌కు కూడా నిధులు లేవని పంచాయతీ కార్యదర్శులు తమ గోడును వెల్లబోసుకుంటున్నారు.

ప్రమాదవశాత్తు పండ్ల తోట దగ్ధం

ఉట్నూర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగోజితండా సమీపంలో ఉన్న డ్రాగన్ ఫ్రూట్స్‌తోట ప్రమాదవశాత్తు దగ్ధం అయినట్లు తెలుస్తుంది. ఈ గ్రామానికి చెందిన రైతు జాదవ్ రాజు నాలుగు ఎకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్స్ తోటను సాగు చేస్తున్నారు. ఆదివారం బంధువు ఒకరు మృతి చెందడంతో వారి అంత్యక్రియలకు వెళ్లగా.. తోటకు మంటలు ఎలా అంటుకున్నాయో అంతుపట్టడం లేదని, ఈ ప్రమాదంలో రూ.12లక్షల నష్టం వచ్చిందని రైతు తెలిపారు. సోమవారం ఈ తోటను మాజీ సర్పంచ్ జాదవ్ హరినాయక్ పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుందామని రైతు కుటుంబానికి భరోసా ఇచ్చారు.

ఉరి వేసుకుని ఒకరి మృతి

భీంపూర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని నిపాని గ్రామానికి చెందిన నీలగిరి నాగన్న(33) అనే వ్యవసాయ కూలీ ఆదివారం రాత్రి తాగిన మైకంలో ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంట్లో దూలానికి ఉరి వేసుకున్నాడు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముంతాజ్ అహ్మద్ తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని ష్యూర్ ఎన్‌జీవో డైరెక్టర్ గోపాల్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికపై అత్యాచారం కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన మాట్లాడుతూ.. ఈ కేసులో బాలికకు అన్యాయం జరిగేలా హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అందుకు వ్యతిరేకంగా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జేఆర్‌సీ) ఎన్‌జీఓ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు స్వీకరించి, హైకోర్టు తీర్పుపై స్టే విధించి బాలిక తరఫున అవకాశం కల్పించినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడైనా బాలల హక్కులకు భంగం వాటిల్లకుండా, వారికి అన్యాయం జరుగకుండా ఎన్జీవోలు కృషి చేస్తాయని ఆయన తెలిపారు.

సమాజ నిర్మాణంలో కీలక పాత్ర : సుగుణ

నార్నూర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడి కీలకపాత్ర అని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. సోమవారం మండలంలోని జామ్డ ప్రభుత్వ విద్యార్థులు బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న హరిచందర్ రాథోడ్ ఉద్యోగ విరమణ సన్మాన సభకు ఆమె హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో భాగంగా 37ఏళ్లు గిరిజన విద్యార్థుల పాఠశాలల్లో పనిచేసి.. ఇటు విద్యార్థులు, అటు గ్రామస్థుల మన్ననలను హరిచందర్ పొందారని కొనియాడారు. అంతకుముందు హరిచందర్ రాథోడ్ దంపతులను సన్మానించారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులున్నారు.

భక్తులకు పండ్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ

తలమడుగు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల నుంచి శబరిమాత భక్తులు పాదయాత్రగా కామారెడ్డి జిల్లా తాడ్వాయి గ్రామంలో గల శబరి మాత ఆశ్రమానికి సోమవారం పాదయాత్రగా బయలుదేరారు. కాగా వారికి పండ్లు, వాటర్ బాటిళ్లను, ఓఆర్ఎస్ పాకెట్లను సామాజిక కార్యకర్త ముడుపు మౌనిశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఇందులో ఆశన్న యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, దినేష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

పెట్టుబడిదారుల కోసమే హెచ్‌సీయూ

భూములపై సర్కారు కన్ను

● పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి వాగ్మారే మహేందర్



పీడీఎస్‌యూ ప్రతినిధుల నిరసన

భైంసా, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడిదారుల దాహం తీర్చేందుకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అక్రమించుకునేందుకు చర్యలు చేపట్టిందని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి వాగ్మారే మహేందర్ ఆరోపించారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ భూముల అక్రమణ, సంబంధిత ఘటనను అడ్డుకున్న విద్యార్థుల అక్రమ అరెస్టులను వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎలాంటి పరిస్థితుల్లో హెచ్‌సీయూ భూముల అక్రమణను జరుగనివ్వబోమని తేల్చి చెప్పారు. సంబంధిత యూనివర్సిటీ కి సంబంధించిన 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమించుకొని వేలం వేసేందుకు సిద్ధమయ్యిందని విమర్శించారు. యూనివర్సిటీల అభివృద్ధికి కృషి చేయాల్సిన ప్రభుత్వం యూనివర్సిటీ భూములను కొల్లగొట్టేలా వ్యవహరించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు, ప్రదర్శనలు చేపట్టారు. ఇందులో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యాక్షుడు పవార్ కిరణ్, ప్రతినిధులు దుర్గ, చంద్రమౌళి, సంతోష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అనుయాయులకు

భూములు అప్పచెప్పేందుకు ప్రభుత్వం కుట్ర

● బీఆర్ఎస్ ముథోల్ సమన్వయ కమిటీ సభ్యుడు

భైంసా, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తమ అనుయాయులకు హెచ్‌సీయూ సమీపంలోని కంచ గచ్చిబౌలి భూములను అప్పచెప్పేందుకు కుట్రపూరిత విధానాలతో ముందుకు సాగుతోందని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యుడు డా. కిరణ్ కోమ్రేవార్ ఆరోపించారు. సోమవారం భైంసాలో పార్టీ కుంటాల, కుబీర్ మండలాల అధ్యక్షులు పడగండి దత్తు,ఎన్నికల్ అనిల్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. భవిష్యత్తు తరాలకు ఎంతో విలువైన, ప్రాధాన్యతతో కూడిన హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తమ వారికి కట్టబెట్టేలా వ్యవహరిస్తోందన్నారు. ఇందులో భాగంగానే సంబంధిత వ్యవహారాన్ని అడ్డుకునేందుకు చర్యలు చేపట్టిన విద్యార్థులపై ప్రభుత్వం పోలీసుల ద్వారా లాఠీ చార్జీలు చేయించడం, అప్రజాస్వామిక విధానాలతో అరెస్టులు, అదుపులోకి తీసుకోవడం చేయిస్తోందన్నారు. ఇదే సమయంలో అక్కడి ప్రాంతంలోని 400 ఎకరాల్లో గల భూములలో బుల్డోజర్లు , జేసీబీల ద్వారా చెట్లను తొలగింప చేస్తూ నీటి వనరుల దెబ్బతీస్తూ విలువైన స్థలాన్ని నాశనం చేస్తున్నారన్నారు. సంబంధిత భూముల వ్యవహారంలో ప్రభుత్వం తమ తీరు మార్చుకోకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు. సరియైన రీతిలో గుణపాఠం నేర్పుతామని తెలిపారు. ఇందులో బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ యువజన విభాగం ప్రతినిధి రవి కుమార్, నిగ్వా మాజీ ఎంపీటీసీ దేవిదాస్, ప్రతినిధులు బండి ప్రశాంత్, బాబు, మహేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ కాలనీలో

తాగునీటి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం

● నూతన బోర్లను, మోటార్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తా : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ● ఈద్గా స్థల పరిశీలన



డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



ఈద్గా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నెల కొన్న తాగునీటి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతానని స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం డబుల్ బెడ్ రూమ్ కాలనీని ఆయ న సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రజల నుండి ఆయన అడిగి తెలు సుకున్నారు. తమకు తాగునీటికి ఇక్కట్లు ఎదురవు తున్నాయని మరోపక్క కనీసం ఫోన్లు కూడా డబుల్ బెడ్ రూమ్ కాలనీలో పని చేయడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సెల్‌ఫోన్ సిగ్నల్ సమ స్య కోసం నూతన సెల్ టవర్లను ఏర్పాటు చేసేలా తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇక కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరి ష్కారం చూపేలా నూతన బోర్లను బోర్ మోటార్లను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. మహిళా స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడితే ఫిల్టర్ వాటర్ ప్లాంట్ సైతం మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పడిందని ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రజల సమస్యలు ఖచ్చితంగా పరిష్కారం అవుతాయన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కాలనీ వాసులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం కొమరం భీమ్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ స్థలంలో ఈద్గా కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని స్థానిక మైనార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో స్థానిక మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం సహా పలువురు నాయకులున్నారు.

నేటి వీర హనుమాన్ విజయయాత్రకు హాజరు కానున్న ఎమ్మెల్యే

ఖానాపూర్‌లో నేడు వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వీర హనుమాన్ విజయ యాత్రకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్‌లు తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేవారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న వీర హనుమాన్ విజయ యాత్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతున్న నేపథ్యంలో మండలంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

అవినీతికి పాల్పడి ఆత్మహత్య చేసుకుంటామంటే భయపడేదిలేదు

● తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు



దిలావర్‌పూర్‌లో ప్రెస్ మీట్‌లో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

దిలావర్‌పూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : అవినీతికి పాల్పడి పైగా ఆత్మహత్య చేసుకుంటానని కంజర్ గ్రామానికి చెందిన ఐకేపీ సీఏ నిమ్మ ముత్యం బెదిరించడం సమంజసం కాదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. ఐకేపీ సీఏ ముత్యం అవినీతిని ప్రశ్నించిన డ్వాక్రా గ్రూపు సభ్యురాలు దళిత కులానికి చెందిన పుష్పను దుర్భాషలాడటంతో ఆమె తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఐకేపీ ఏపీఎంకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఆ ఫిర్యాదలో సీఏ నిమ్మముత్యం అవినీతికి పాలపడుతున్న విషయాలను కూడా పేర్కొనడం జరిగిందన్నారు. విచారణ చేసిన ఐకేపీ అధికారులు ఐదు లక్షల పైగా అవినీతికి పాల్పడినట్లు తేల్చారన్నారు. సీఏ ముత్యంను విధుల నుంచి తొలగించేందుకు ఐకేపీ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారని తెలిసి సీఏ ముత్యం తనకు తానుగా రాజీనామా చేశారన్నారు. ఇదిలా ఉండగా సీఏ ముత్యం తన భార్యతో కంజర్ గ్రామానికి చెందిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకులు బర్కుంట గంగారాంతో పాటు కంజర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లతో కలిసి మొత్తం ఆరుగురి పైన కేసు పెట్టించాడన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదులో మా భర్త ఇప్పటి వరకు ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, వీళ్లు మా భర్తపై కావాలని అభాండాలు మోపడంతో ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు కల్పించారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. మా భర్తకు జరుగ రానిది ఏదైనా జరిగితే గంగారాం, మాజీ సర్పంచ్‌లే బాధ్యులని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం చూస్తే చేసిన అవినీతిని కప్పి పుచ్చుకునేందుకేనని అన్నారు. అవినీతి చేసి ఆత్మహత్య చేసుకుంటామంటే భయపడేది లేదన్నారు. అందుకు మేమెందుకు బాధ్యత వహిస్తామన్నారు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. ఆత్మహత్య చేసుకుంటే మా బాధ్యత లేదన్నారు. ఐకేపీ సీఏలు అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారన్న సానుభూతి మాకుందని, అలా అని మహిళలు రూపాయి రూపాయి కూడ బెట్టుకున్న డబ్బులు తీసుకుంటామంటే ఎలా అని ప్రశ్నించారు. ఐకేపీ సీఏలకు కనీస వేతనాలు చెల్లించాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారి న్యాయమైన డిమాండ్‌ల సాధనకు మేము సంపూర్ణ మద్దతు తెలియజేస్తామని, అండగా ఉంటామన్నారు. గ్రామాల్లో సీఏలు పద్ధతిగా పని చేయాలని, అవకతవకలకు పాల్పడవద్దని కోరారు. ఐకేపీ అధికారులు స్పందించి అవినీతికి పాల్పడ్డ సీఏ ముత్యంను విధుల నుండి తొలగించి మహిళా సీఏను నియమించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గైని మురళీమోహన్, డివిజన్ నాయకులు బర్కుంట గంగారాం, సీపీఎం మండల కార్యదర్శి అవర్గ ముత్యం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గడ్డం రాజేష్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ రోడ్డు కబ్జా

● చోద్యం చూస్తున్న అధికారులు



బోథ్ బస్టాండ్ పక్కన ఉన్న రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలు హోటళ్లు

బోథ్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రోడ్లను ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు జరుగుతుంటే మురికి కాలువలను ఆక్రమించుకొని వ్యాపారసంస్థలు నెలకొల్పుకుంటున్నారు అయితే తాజాగా బోథ్ బస్టాండ్ పక్కన ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ఆక్రమించుకొని ఓవైపు హోటల్‌లో యజమానులు షెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తుంటే తామేము తక్కువగా లేమంటూ పాన్‌డబ్బా వ్యాపారి నడిరోడ్డుపై షాప్ ఏర్పాటు చేసి వ్యాపారాన్ని నిర్వహించుకుంటున్నారు. అడిగే వారు లేకపోవడంతో దమ్మున్నోడే దాదాగిరితో రోడ్లను ఆక్రమించుకొని మురికి కాలువలను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఎప్పుడైనా గ్రామ పంచాయతీ వారు రోడ్డుకు అడ్డంగా ఉన్న దుకాణాలను తీయమంటే ముందు మా పక్కన ఉన్న దానిని తీస్తే నేను తీస్తాను అంటూ భీష్మించుకు కూర్చుంటున్నారు. ఇక పాత సినిమా థియేటర్ ప్రాంతంలో కొంతమంది వ్యాపారులు తమకు సత్తా ఉన్నంత మేరకు ఆక్రమాలు చేసి వ్యాపారాలను చేస్తున్నారు.

● అద్దెకు ఆక్రమణ స్థలం

పట్టణంలో అక్కడక్కడ ఆక్రమించుకున్న వారు తమ దుకాణాలను ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. బస్టాండ్ నుంచి పాతసినిమా థియేటర్ వరకు అక్రమాలు అడ్డగోలుగా చేపట్టారు. మురికి కాలువలపై దుకాణాలను ఏర్పాటు చేసుకొని దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్న వారిని అడిగే వారిలేరు. దీంతో రోడ్లు ఇరుకుమయంగా మారాయి. ప్రధాన రహదారిపై ఆక్రమణలు చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. కొందరికి వ్యాపార సంస్థల నిర్వహణకు గదులు ఉన్న వాటిని అద్దెకు ఇచ్చి ఆక్రమించిన స్థలాల్లో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు,

● పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

మండల కేంద్రంలో ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని నిర్మాణాలు కొనసాగుతున్న పంచాయతీ అధికారులకు చీమకుట్టినట్టు లేదు. అంతేగాక ఫిర్యాదు ఇచ్చిన అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పత్రికలలో వార్తలు ప్రచురితమైనప్పుడు జిల్లాస్థాయి నుంచి వచ్చిన అధికారులు హంగామా సృష్టించి జరిమానాలు వేసి తమ పని అయిపోయిందంటూ వెళ్ళిపోతున్నారు. ఆ తర్వాత ఆక్రమణలు యథాతథంగా ఉండడంతో పాటు ఆక్రమించుకున్నాక వారు మరింత రెచ్చిపోతున్నారు. కలెక్టర్ ఈ విషయంలో చొరవ చూపించి తగు ఆదేశాలు జారీ చేస్తే ఆక్రమణలు గురవుతున్న రోడ్డు కబ్జాదారుల నుంచి విముక్తి పొందే ఆస్కారం ఉంది.




మండలంలోని పలు గ్రామాల్లో అస్తవ్యస్తంగా మారిన మురికి కాలువలు

పడకేసిన పారిశుధ్యం

● అస్తవ్యస్తంగా మురికి కాలువలు
● తీవ్రమవుతున్న దోమలు
● పట్టించుకోని అధికారులు

తాంసి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం పడకేస్తుంది. మురికి కాలువలు ఎక్కడికక్కడే నిండిపోయాయి. ప్రతీ వారం, పది రోజులకు ఒకసారి మురికి కాలువలను శుభ్రం చేయాల్సి ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. తాంసి మండలంలో చాలా గ్రామాల్లో ఇదే సమస్య కనిపిస్తుంది. సాక్షాత్తు మండల కేంద్రమైన తాంసిలో సైతం మురికి కాలువలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక మారుమూల పంచాయతీల్లో ఎలా ఉంటుందో అర్థమవుతుంది. దీంతో దోమల తీవ్రత పెరిగి వ్యాధులు సోకుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో స్థానిక కార్యదర్శులు గాని, ప్రత్యేక అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. మండల స్థాయి అధికారులు గ్రామాల్లోకి వెళ్లి తూతూ మంత్రంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు తప్ప గ్రామాల్లోని సమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు సైతం వ్యక్తం అవుతున్నాయి. కొన్ని గ్రామపంచాయతీలకు సకాలంలో బిల్లు రాకపోవడం వల్ల మురికి కాలువలను శుభ్రం చేయలేకపోతున్నామని, సకాలంలో పనులు జరగడం లేదని కార్యదర్శులే అంటున్నారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇకనైనా మురికి కాలువలను శుభ్రం చేసే పనులు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.





చిక్‌మాన్ వాగులో చెలిమె నీరు తీస్తున్న గిరిజనులు



బోరు దగ్గర నీళ్ల కోసం వేచి చూస్తున్న గిరిజనులు



వాగులో నుంచి నీరు తీసుకెళ్తున్న గిరిజనులు

తాగునీటి కోసం ఇబ్బందులు

● బిందెడు నీళ్ల కోసం మైళ్ల దూరం నడక ● పత్తా లేని మిషన్ భగీరథ నీరు ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

పెంబి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. పెంబి మండలంలోని దొందారి గ్రామ పంచాయతీ పరిధిలోని వస్‌పల్లి, కొత్తగూడెం గ్రామాల్లో ఉన్న రెండు బోర్లలో నీరు రాక పోవడంతో మైళ్ల దూరంలో ఉన్న చిక్‌మాన్ వాగు చెలిమే నీటితో సరిపెట్టుకుంటున్నారు. గ్రామంలో ఇప్పటి వరకు మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయకపోవడంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామాల్లో తాగునీరు లేక ప్రజల దాహార్తి తీరడం లేదు.

వాస్‌పల్లి గ్రామస్థులకు చెలిమే నీరే దిక్కు

దొందారి పంచాయతీ పరిధిలోని చాకిరేవు, చాకిరేవు కొత్తగూడెం, గ్రామాల్లో 50 కుటుంబాలు, 200 జనాభా ఉంది. తమ గ్రామాల్లో బోరు ఉన్నప్పటికీ వాటి ద్వారా చుక్క నీరు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో తాగునీరు పథకాలు లేవు. దీంతో చేసేదేమీ లేక గ్రామానికి 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న చిక్‌మాన్ వాగు నుంచి ఎడ్ల బండిలో డ్రమ్ములు వేసుకొని, బిందెలతో తెచ్చుకుంటున్నారు. ఎండలో చెలిమే వద్ద పడిగాపులు కాస్తూనీరు తెచ్చుకుంటున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు గ్రామస్థులు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామాలకు పలుచోట్ల ద్విచక్ర వాహనాలు వెళ్లని పరిస్థితి నెలకొంది. అసలే అసౌకర్యాలతో కొట్టు మిట్టాడుతున్న మాకు తాగునీటి సమస్య తీర్చే వారు లేకుండా పోయారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వాగులో చెలిమే నీరే దిక్కు

● దినేష్, వస్‌పల్లి, కొత్తగూడెం



గ్రామంలో తాగునీటి పథకాలు లేవు. నీటి కోసం 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న చిక్‌మాన్ వాగుకి కాలినడకన పోతున్నాం. చెలిమే నీరును ఎడ్ల బండి, బిందెలతో తెచ్చుకుంటున్నాం.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

● పారుబాయి, వస్‌పల్లి



తాగునీటి సౌకర్యం కల్పించాలి. గ్రామంలో ఉన్న చేతి పంపు నీరు రాకపోవడంతో గ్రామ సమీపంలోని చిక్‌మాన్ వాగు చెలిమే నీరే దిక్కు. అధికారులు స్పందించి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలి.

మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి

● రాహుల్, వస్‌పల్లి



గ్రామంలో నీటి సమస్యతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటి వరకు మా గ్రామానికి మిషన్ భగీరథ పైప్ లైన్ వేయలేదని, వెంటనే మిషన్ భగీరథ పైప్ లైన్ ఏర్పాటు చేసి మాకు తాగు నీరందించాలి.



దిలావర్‌పూర్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



భైంసాలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నిర్మల్ జిల్లాలో ఘనంగా రంజాన్

దిలావర్‌పూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్లింలు రంజాన్ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దిలావర్‌పూర్, సాంగ్వి, బన్సపల్లి, సిర్గాపూర్, న్యాలోలం, కంజర్ గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలకు పలువురు హిందువులు, నాయకులు ఈద్ ముబారక్ అని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

భైంసా: డివిజన్ పరిధిలో ముస్లింలు సోమవారం రంజా న్ పండుగను భక్తి ప్రవత్తుల మధ్య ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. పర్వదినాన్ని పురస్కరించుకొని భైంసా పట్టణ గడ్డెన్న వాగు ప్రాజెక్టు సమీపంలోని ఈద్గా వద్ద ముస్లింలు సామూహిక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గామైదానం వద్ద భైం సా పట్టణంతో పాటు సమీప ప్రాంతాల్లోని ముస్లింలు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రార్థనలను నిర్వహించారు. పట్టణ మత పెద్దలు ఉదయం వేళలో హాజరైన వారిని ఉద్దేశించి ప్రవచనాలను బోధించారు. 10 గం టల సమయంలో రంజాన్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని ఆయా మసీదుల వద్ద ప్రార్థనలతో కోలాహలం కనపడింది. ప్రార్థనల కోసం వచ్చే వారితో మసీదులు కిటకిట లాడాయి. మున్సిపల్ మాజీ చైర్మెన్ జాబీర్ అహ్మద్, భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఫయాజుల్లాఖాన్‌లు ఈద్గా వద్ద హాజరైనవారందరికి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ ,మాజీ ఎమ్మెల్యేలు బోస్లే నారాయణరావ్ పాటిల్, జి.విఠల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్‌లు ముస్లింలను కలిసి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

● **భారీ పోలీసు బందోబస్తు**

రంజాన్ పర్వదిన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు గాను భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టారు. భైంసా టౌన్ సీఐ గోపినాథ్ ఆధ్వర్యంలో భద్రత చర్యలు చేపట్టారు. వీరితో పాటు డివిజన్ పరిధిలో గల పోలీసులు , స్పెషల్ పోలీసుల బెటాలియన్లు బందోబస్తులో పాల్గొన్నాయి. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఈద్గాలతో పాటు అనుమానస్పద ప్రాంతాలన్నింటిలోనూ ఉదయం డాగ్ స్క్వాడ్ ,బాంబు స్క్వాడ్ టీంలు తనిఖీలు నిర్వహించాయి.

లక్ష్మణచాంద: మండలంలో ఆయా గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. నెల రోజులుగా ఉపవాస దీక్షలో (రోజా) ఉన్న ముస్లింలు స్థానిక మసీద్, దర్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మౌల్ సాబ్‌లు శాంతి సందేశం ఇచ్చారు.



ముథోల్‌లో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

సారంగాపూర్: మండల కేంద్రంతో పాటు స్వర్ణ, బీరవెల్లి, జామ్, చించోలి గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో సోమవారం ముస్లింలు ఘనంగా రంజాన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రార్థనలను చేసి ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని తరోడా, ఎడ్‌బిడ్, మచ్కల్, ఆష్ట తదితర గ్రామాల్లో సోమవారం మైనార్టీ సోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద, మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా ముథోల్ సీఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు నిర్వహించారు.

కుభీర్: మండల కేంద్రంతో పాటు మండలంలోని జాంగాం, పార్డి(బి), పల్సి తదితర గ్రామాల్లో సోమవారం ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రహమాన్‌సాబ్ ఈద్‌గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతగురువు జాకీమౌలానా ఖురాన్ విశిష్టతలను తెలియజేశారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలను తెలుపుకున్నారు.

కుంటాల: మండల కేంద్రం కుంటాలలో సోమవారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. గత నెల రోజుల నుంచి సూర్యోదయం మొదలుకొని సూర్యాస్తమయం వరకు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన వారు సోమవారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలను ధరించి ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. మండలంలోని ఓలా, కల్లూర్, అమ్దాకూర్ తదితర గ్రామాల్లో ఈద్గాల వద్ద ముస్లింలు పూజలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.



ముథోల్‌లో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



కుభీర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

సంప్రదాయ

పెళ్లిళ్ల వైపు.. గిరిజనుల మొగ్గు

●ఆర్భాటాలకు స్వస్తి



పార్డీ బి గ్రామ పంచాయతీలో సమావేశమైన ఆదివాసీలు

బోథ్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెళ్లిల్లో దుబారా ఖర్చులు తగ్గించి సాంప్రదాయ బద్ధమైన పెళ్లిలను చేసి ఆదర్శంగా నిలవాలన్న ఆలోచన గిరిజన సామాజిక వర్గాల్లో ఉత్పన్నమగుతుంది. ముఖ్యంగా కొన్ని వర్గాల ప్రజలు పెళ్లిలను ఆర్భాటంగా చేస్తూ పేరుకోసం దుబారా ఖర్చులు అధికంగా చేస్తున్నారు. అయితే ఆయా వర్గాలలో సంపన్నుల పెండ్లిలను చూసి పేదరికంలో ఉన్న కుటుంబాల వారు సైతం అప్పులు చేసి పెళ్లిలు అర్భాటంగా చేస్తున్నారు. అయితే ఈ విధమైన పెళ్లిల జోలికి వెళ్లకుండా సాంప్రదాయ పద్ధతిలో పెళ్లిలను చేసుకోవాలని నిర్ణయానికి వస్తున్నారు. జిల్లాలో ఉన్న లంబాడ సామాజిక వర్గంలో ఎక్కువ మొత్తంలో ఉద్యోగులు ఉండడంతో తమ పెళ్లిళ్లు ఆర్భాటంగా చేస్తున్నారు. దీంతో పేదరికంలో ఉన్న అదే సామాజిక వర్గం వారు సంపన్నులు చేసిన పెండ్లీల తరహాలో పేదలు అప్పుచేసి పెళ్లిలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు తమ పిల్లల పెండ్లీలు చేయాలంటే అప్పులు చేయక తప్పడం లేదు. దీంతో పెండింగ్ చేసి పేదరికంలో మగ్గిపోవాల్సి వస్తుంది. అయితే ఈ విషయాన్ని గమనించిన లంబాడ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు ఆర్భాటాలకు పెళ్లిళ్లకు స్వస్తి పలకాలని ఇటీవల నిర్ణయించడం జరిగింది. లంబాడ సామాజిక వర్గం వారు పెండ్లిలలో డీజేను వినియోగించవద్దని అంతేగాక ఫోటోషూట్ పేరుతో అనవసరపు ఖర్చును నివారించాలని తీర్మానించారు. హల్దీ పేరుతో అనవసరమైన ఖర్చులు చేయాల్సి వస్తుందని మూడు తులాల కంటే ఎక్కువ బంగారాన్ని పెళ్లిళ్లలో వినియోగించరాదని తీర్మానించుకోవడం జరిగింది. సాంప్రదాయ రీతిలో పెండ్లిలను చేస్తే ఖర్చు తగ్గడంతో పాటు కుల రీతిగా పెండ్లి చేసినట్టు అవుతుందని పేర్కొంటున్నారు.

● **ఆదివాసి సంప్రదాయాలకు విలువనివ్వండి**

ఆదివాసీలు తమ ఇళ్లలో జరిగే పెళ్లిళ్లను సాంప్రదాయబద్ధంగా చే యాలని నిర్ణయానికి వస్తున్నారు. సంపన్నులైనా పేదలైన తమ పెళ్లిలను సాంప్రదాయం బద్ధంగా జరుపుకోవాలని పార్డీ బి గ్రామంలో జరిగిన రాయి సెంటర్‌లో గ్రామస్థులు తీర్మానించుకోవడం జరిగింది. పెళ్లిల సందర్భంగా అయినాల పేరుతో దూరపు బంధువులకు సైతం బట్టలు కానుకలుగా చేయడం జరుగుతుందని ఈ విధానానికి స్వస్తి పలకాలని తీర్మానించారు. అంతేగాక అయినాలు పెడితే రక్తసంబంధీకులకు మాత్రమే పెట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అంతేగాక ఎర్ర బొట్టు పేరుతో వృధా ఖర్చు చేరదని ఎర్రబొట్టు కార్యక్రమాన్ని చేస్తే కేవలం రెండు వాహనాలలో మాత్రమే వెళ్లాలని తీర్మానించుకున్నారు. ఇక పెళ్లి చేసే కుటుంబాల వారిని ప్రోత్సహించేందుకు చేతనైనంత నగదును ఇచ్చే విధంగా చూడాలని తీర్మానించారు.

● **ఆర్భాటాలకు దూరం**

గిరిజన సామాజిక వర్గాల వారు ఆర్భాటాలకు దూరంగా ఉండాలని నిర్ణయించడంతో పెళ్లిళ్లలో అయ్యే దుబారా ఖర్చులు తగ్గిపోయే ఆస్కారం ఉంది. సంపన్నుల పెళ్లిలను చూసి పేదల సైతం దుబారా ఖర్చులు చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. భవిష్యత్తులో సాంప్రదాయ పెళ్లిల్లే జరిగే ఆస్కారం ఉందని ఆయా కులాల పెద్దలు పేర్కొంటున్నారు.

ఉపాధి హామీపై అవగాహన లేక ఆసక్తి చూపని కూలీలు

● 10 వేల మందికి జాబ్ కార్డులు ● నీరు, నీడ లేక ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు

తలమడుగు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించాలనే దృఢ సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ. పథకంలో కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో ఉపాధి హామీ పథకం నీరుగారిపోతుంది. గతంలో వేళల్లో కూలీలు పనులకు వస్తుంటే నేడు పదుల సంఖ్యలో కూలీలు పనులకు అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో 29 గ్రామ పంచాయతీలకు గాను దాదాపు పదివేల మందికి జాబ్ కార్డులు ఉండగా పనులకు వస్తున్న కూలీల సంఖ్య రెండు వేల లోపు మంది కూలీ పనులకు వస్తున్నారు. కూలీలకు పనులు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వ్యక్తం అవుతున్నా అదేవిధంగా పని చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో కనీస మౌలిక వసతులు అధికారులు కల్పించలేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న ఎండల తీవ్రతో జనం ఇంటి నుంచి బయటకు వెళ్ళందుకే ఇబ్బందులు పడుతున్నారు. అలాంటిది ఎర్రని ఎండలో ఉపాధి హామీ కూలీలు పనులకు వెళ్తున్నప్పటికీ పని ప్రదేశంలో నిల్చోడానికి నీడ లేక, తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది కూలీలు వసతులు కల్పించకపోవడంతో పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. మండలంలోని 29 గ్రామపంచాయతీలకు గాను పది వేల మందికి జాబ్ కార్డులు ఉన్నప్పటికీ పనులకు మాత్రం రెండు వేలలోపు మంది కూలీలు పనులకు వస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో 52 రకాల పనులు ఉన్నప్పటికీ ఆ పనులపై అధికారులు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించలేకపోవడంతో ఉపాధి హామీ పనులపై కూలీలు ఆసక్తి చూపడం లేదు. అంతేకాకుండా పనులకు వస్తున్న కూలీలకు ప్రభుత్వ లెక్క ప్రకారం ప్రతీ కూలీకి 300 రూపాయలు ప్రతీ రోజు కూలి దక్కాల్సి ఉండగా పనిచేసిన ప్రదేశంలో అధికార కొలతలు సకాలంలో చేపట్టకపోవడంతో. కేవలం రూ.50 నుంచి 150 వరకు కూలి రావడంతో నిరాశ చెందుతున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి వంద లోపే కూలీలు వస్తున్నారు. అంతేకాకుండా పనులు జరుగుతున్న ప్రదేశంలో కూలీలకు మౌలిక వసతులు సక్రమంగా కల్పించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పని జరుగుతున్న ప్రదేశంలో కూలీలు నీడ సౌకర్యం, తాగునీటి సౌకర్యం, ప్రథమ చికిత్స, కిట్టు ఏర్పాటు చేయాలి కానీ అవేవీ ఏర్పాటు చేయడం లేదని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు దూర ప్రాంతాల్లో ఉంటే వారికి రవాణా సౌకర్యం కల్పించాలి కానీ అవేవీ కల్పించడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి ఉపాధి హామీ కూలీలకు మౌలిక వసతులు కల్పించి కూలీల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.



ఉపాధి హామీ పనులు చేపడుతున్న కూలీలు



కూలీలకు నీడ లేకపోవడంతో చెట్ల కింద సేద తీరుతున్న ఉపాధిహామీ కూలీలు

andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.4 • కనిష్ఠం 24.7
ఆంధ్రజ్యోతి
నిర్మల్ జిల్లా వార్తలు
8
మంగళవారం 1 ఏప్రిల్ 2025





ధాన్యం అక్రమాలపై విజిలెన్స్

- తీగలాగుతున్నారు.. డొంక కదలుతోంది
- అక్రమాలపై మరింత లోతైన దర్యాప్తు
- గత ప్రభుత్వ హయాంలోనే అక్రమాలకు నాంది
- సివిల్ సప్లయ్ కార్యాలయంలో కీలకంగా ఇద్దరు సిబ్బంది

నిర్మల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరిగిన సీఎంఆర్ ధాన్యం అక్రమాల వ్యవహారం రోజు రోజుకు మలుపు తిరుగుతోంది. ఇప్పటి వరకు ఆ శాఖకు సంబంధించిన రాష్ట్రస్థాయి అధికారులే ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకున్నారు. అయితే దాదాపు రూ.200 కోట్లకు పైగా జరిగిన ఈ అక్రమాల వ్యవహారంపై ప్రభుత్వం ఆషామాషీ విచారణ కాకుండా మరింత లోతుగా దర్యాప్తు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే 2022 ఖరీఫ్ నుంచి మొదలుకొని ఇటీవలీ ఖరీఫ్ సీజన్ వరకు రైస్‌మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ ధాన్యంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపేందు కోసం విజిలెన్స్ విభాగాన్ని రంగంలోకి దించబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారులు జిల్లా అధికారుల నుంచి దీనికి సంబంధించి పూర్తి వివరాలను సేకరించినట్లు తెలిసింది. అయితే ఇప్పటికే ఈ అక్రమాల వ్యవహారంపై ఉదాసీనంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న డీఎస్ఓ, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌తో పాటు ఓ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీని ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ముగ్గురే కాకుండా అక్రమాల వ్యవహారంలో మరికొంతమంది అధికారులు, సిబ్బంది పాత్ర ఉన్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఇక్కడి పౌర సరఫరాలశాఖలో పనిచేస్తున్న ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్‌ల పాత్ర కూడా ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా ఒక టీఏ చాలా సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటూ మొత్తం కార్యాలయ వ్యవహారాల్లో చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలున్నాయి. టెక్నికల్ అసిస్టెంట్ చెప్పిందే వేదంగా పౌర సరఫరాల శాఖలో కార్యకలాపాలు సాగుతున్నాయని అంటున్నారు. రాజకీయ పలుకుబడితో పాటు అధికారుల అండదండలున్న సదరు టెక్నికల్ అసిస్టెంట్ సంబంధిత శాఖ ఉన్నతాధికారులను సైతం శాసించే స్థాయిలో ఉన్నాడంటున్నారు. ప్రస్తుతం జరిగిన ధాన్యం అక్రమాల వ్యవహారంలో సదరు టెక్నికల్ అసిస్టెంట్‌తో పాటు మరికొంతమంది అధికారులు, సిబ్బందిపై కూడా విచారణ జరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు.



బాసర మండలం కీర్గుల్(బి)లోని అక్షయ రెడ్డి రైస్ మిల్ ఇదే

ఏడాది కాలంలోనే వందకు పైగా పెరిగిన రైస్‌మిల్లులు

సీఎంఆర్ ధాన్యం అక్రమాలను ఆసరాగా చేసుకుంటున్న కొంతమంది రైస్‌మిల్లర్లు తమ బీనామీల పేరిట ఇష్టానుసారంగా కొత్త రైస్‌మిల్లులను ఏర్పాటు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ధాన్యం నిల్వలు, కేటాయింపులను తమ రైస్‌మిల్లుల నుంచి బీనామీ రైస్‌మిల్లులకు మార్చుకుంటూ నిల్వల లెక్కలను తలకిందులు చేశారంటున్నారు. ఈ స్టాక్ మార్పిడి కారణంగా లెక్కలన్ని తారుమారవ్వడమే కాకుండా తనిఖీలకు వచ్చే అధికారులకు సైతం అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. అయితే మొన్నటి వరకు 76 రైస్‌మిల్లులు మాత్రమే ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 102కు చేరుకుంది. ఈ 102 రైస్‌మిల్లుల్లో ఎక్కువగా బీనామీలవేనని చెబుతున్నారు.

ఒక్కో యజమానికి రెండు నుంచి మూడు రైస్‌మిల్లులు

కాగా కొంతమంది రైస్‌మిల్లర్లు అక్రమ ధాన్యం దందాతో కోట్ల రూపాయలను ఆర్జించి తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకునేందు కోసం బినామీ రైస్‌మిల్లులను కూడా ఏర్పాటు చేసుకున్నట్లు చెబుతున్నారు. ఈ రైస్‌మిల్లులకు ఎలాంటి మిల్లింగ్ సామర్థ్యం లేనప్పటికీ కేవలం ధాన్యాన్ని కేటాయింపజేసుకోవడం వాటిని నిల్వ చేసుకోవడం లాంటి వాటికే పరిమితం చేశారంటున్నారు. అసలు మిల్లులో ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నట్లు చూపి ఆ లెక్కలను తమ బినామీల మిల్లులకు తరలించి అక్కడ కూడా మిల్లింగ్ జరుగుతున్నట్లు చూపుతూ అధికారులను బురిడీ కొట్టించారు. ఈ రైస్‌మిల్లుల సిండికేట్ అధికారులకు అర చేతిలో వైకుంఠం చూపి పెద్దమొత్తంలో కాజేసినట్లు ఫిర్యాదులున్నాయి.

రంగంలోకి విజిలెన్స్

జిల్లాలో పతాకస్థాయికి చేరుకున్న ధాన్యం మిల్లింగ్ అక్రమాల వ్యవహారంపై విజిలెన్స్ విభాగం సీరియస్‌గా దృష్టి సారించబోతున్నట్లు సమాచారం. 2022 ఖరీఫ్ నుంచి ఇప్పటి వరకు రైస్‌మిల్లుల వారీగా విచారణ జరపబోతున్నారు. ఒక్కోసీజన్‌కు జరిగిన కేటాయింపులు, మిల్లింగ్ లెక్కలతో పాటు స్టాక్ రిజిస్ట్రార్‌లపై విచారించనున్నారు. అలాగే అధికారులు తనిఖీలు చేసి ఎలాంటి చర్యలు తీసుకున్నారనే అంశాన్ని కూడా తమ విచారణ ద్వారా వెలుగులోకి తీసుకురానున్నారు. అయితే అన్ని రైస్‌మిల్లులను విజిలెన్స్ అధికారులు బృందాలుగా విడిపోయి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. కాగా రాజకీయ అండదండలు భారీగా ఉన్న ఈ రైస్‌మిల్లర్ల సిండికేట్ విజిలెన్స్ విచారణను అడ్డుకునేందుకు కూడా ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. తమకున్న రాజకీయ పలుకుబడితో విచారణతో పాటు కేసులను సైతం నీరుగార్చేందుకు ముందస్తు ప్రయత్నాలు మొదలుపెట్టారంటున్నారు.



తిరుపెల్లిలోని రైస్‌మిల్లుల్లో రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడి చేసి పట్టుకున్న ధాన్యం లారీ ఇవే (ఫైల్)

కదిలిలో శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం



కదిలిలో శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

దిలావర్‌పూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం రాత్రి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి శ్రీ హనుమాన్ మాల వేస్తున్న భక్తులు హాజరయ్యారు. ఆంజనేయ స్వామి భక్తి గీతాలాపనలతో శ్రీరామ స్వామి భజన కీర్తనలు పాడారు. రాంచందర్ ఆర్కెస్ట్రా బృందం భక్తి పాటలతో దేవస్థానం ప్రాంగణం మార్మోగింది. అంతకుముందు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పండ్లు పంచిపెట్టారు.

చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



చలివేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే

నిర్మల్ కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సోమవారం పట్టణంలోని 31వ వార్డు బోయవాడ పరిధి బస్‌డిపో సమీపంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. నాయకుడు జింక సూరి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటైంది. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జింకసూరిని ఎమ్మెల్యే సన్మానించారు. నాయకులు డి.ముత్యంరెడ్డి, సుధాకర్, మౌర్య, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సోమవారం సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మామడ, లక్ష్మణచాంద, సోన్, సారంగాపూర్, నర్సాపూర్, దిలావర్‌పూర్, నిర్మల్ మండలాలకు చెందిన 137 మంది లబ్ధిదారులకు రూ. 45 లక్షల రూపాయల విలువ గల చెక్కులను అందజేశారు. రావుల రాంనాథ్, సత్యనారాయణగౌడ్, ఆయా పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి మహేశ్వర్‌రెడ్డి రూ.1.25 లక్షల విరాళం

లక్ష్మణచాంద, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో గల రామాలయంలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రూ. 1,25,000లు విరాళంగా ఇస్తానని హామీ ఇచ్చినట్లు చామన్‌పెల్లి గ్రామస్థులు సోమవారం తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణ కోసం చామన్‌పెల్లి గ్రామస్థులు మహేశ్వర్‌రెడ్డిని కలిశారు. వీరి విన్నపంను ఆలకించిన మహేశ్వర్‌రెడ్డి పై మొత్తాన్ని ఇస్తానని చెప్పటంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, రమేష్, చిన్నయ్య, వెంకట్‌రెడ్డి, సురేష్, మధు, ఏ.మహిపాల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎం. సాయన్న, కే. మహిపాల్ రెడ్డి, బి. సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస పథకానికి
భారీ సంఖ్యలో దరఖాస్తులు తీసుకుంటున్నాం

- డిప్యూటీ సీఎంకు అదనపు కలెక్టర్ వెల్లడి



డిప్యూటీ సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్, అధికారులు

నిర్మల్ కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోయే రాజీవ్ యువవికాస పథకానికి అర్హులు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వివరించారు. డిప్యూటీ సీఎం సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో దాదాపు 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకు పథకం ఉద్దేశించిందన్నారు. అర్హులైన వారు ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ పథకం కుటుంబంలో ఒకరికే వర్తిస్తుందన్నారు. తీసుకున్న రుణానికి రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత యువత వార్షిక ఆదాయం 1.50 లక్షలు, పట్టణ ప్రాంత వాసులకు 2 లక్షల లోపు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న తరువాత పత్రాలు మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో అందించాలని సూచించారు. ఈ మేరకు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా అధికారులను ఆదేశించామని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ మేరకు పలుమార్లు పత్రిక ప్రకటనలు జారీ చేశామన్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలు వివరించారు. బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, మైనారిటీ శాఖ అధికారి మోహన్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వంకర్, తదితర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

రాజీవ్ యువ వికాస్ యోజన స్కీం అర్జీ తేదీని పొడిగించాలి

నిర్మల్ రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాస్ స్కీం పథకాల దరఖాస్తులు స్వీకరించే తేదీని పొడిగించాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ పథకానికి రేషన్ కార్డులతో లింక్ చేయడం వలన రేషన్‌కార్డు లేని పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పథకం అమ లులో అనేక పరిమితులు విధించడం వల్ల సహాయం అందకుండానే, కులం సర్టిఫికెట్, ఆదాయం సర్టిఫికెట్స్ కోసం ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

జేఏసీ ఆవిర్భావ సభకు తరలిన నేతలు

నిర్మల్ కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, జేఏసీ ఆవిర్భావ సభకు నిర్మల్ జిల్లా కేంద్రం నుండి నాయకులు బయలుదేరి వెళ్లారు. కన్వీనర్ రాఘవేంద్ర ముదిరాజ్ పిలుపు మేరకు రాజు మహారాజ్, సొన్న భూమేష్, సుధాకర్, సిలారి శ్రీనివాస్, ప్రవీణ్ వెళ్లారు. రాష్ట్ర జనాభాలో 90 శాతం ఎస్సీ ఎస్టీ, బీసీ వర్గాల జనాభా ఉందని, వారికి దక్కాల్సిన వాటా దక్కడం లేదని నాయకులు తెలిపారు. అగ్రకులాల వారే తమకు రావలసిన వాటాను అనుభవిస్తున్నారన్నారు. న్యాయమైన వాటా దక్కించుకోవడం కోసం చైతన్యం చేయనున్నట్టు తెలిపారు.

అగ్ని ప్రమాద సంఘటన స్థలం పరిశీలించిన ఆర్ఐ



కుంటాల, మార్చి, 31 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓలా గ్రామంలో శనివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగి వడ్రంగి షెడ్లు కాలిబూడిదవ్వగా సోమవారం ఆర్ఐ రాజేశ్వర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఘటన కు సంబంధించిన వివరాలను బాధితులకు అడిగి తెలుసుకున్నారు. పంచనామ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో ఘనంగా రంజాన్ వేడుకలు

- ముస్లింలకు పలువురు నేతల శుభాకాంక్షలు
- ప్రార్థన స్థలాల్లో ప్రత్యేక ప్రార్థనలు



శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీహరి రావు

నిర్మల్ కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్ష కొనసాగించి ఆదివారం సాయంత్రం చంద్రుడిని దర్శించి దీక్షలు విరమించారు. సోమవారం పట్టణంఓలని జామ మస్జిద్, ఈద్గామ్ ఈద్గా, గుల్జార్ మార్కెట్ తదితర ప్రార్థన స్థలాల్లో ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. పిల్లలు, పెద్దలు కొత్త బట్టలు ధరించి మస్జిద్‌లకు వెళ్లారు. ప్రార్థనల తరువాత ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. పండగ రోజు వారంతా విందులు, వినోదాలతో ఆనందోత్సాహాలతో గడిపారు.



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జు మంద్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం రంజాన్ పండగ సందర్భంగా వేరువేరుగా ప్రార్థన స్థలాలకు వెళ్లి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండగ ముస్లిం వర్గాల్లో సంతోషం నింపాలని వారు ఆకాంక్షించారు. శ్రీహరిరావు వెంట ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, నాయకులు పోశెట్టి, భూరాజ్, కొట్టే శేఖర్, తదితరులు ఉన్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి వెంట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, అనుముల భాస్కర్, ముడుసు సత్యనారాయణ, రాంచందర్, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్,

ఖానాపూర్‌లో..

ఖానాపూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పర్వదిన వేడుకలు సోమవారం ఖానాపూర్‌లో ఘనంగా జరిగాయి. పవిత్ర రంజాన్ మాసంలో నెల రోజులపాటు ఉపవాసదీక్షలో ఉన్న ముస్లింలు భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగను జరుపుకున్నారు. ఈ సందరభంగా స్థానిక ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ నూతన వస్త్రాలను అలంకరించుకుని సువాసనలు వెదజల్లే ఖరీదైన అత్తరులను అద్దుకొని పెద్ద ఎత్తున ఈద్గా వద్దకు తరలివచ్చారు. హైదరాబాద్‌కు చెందిన మౌలానా ముసద్దిక్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాయి. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పలువురు నిరుపేదలకు ముస్లింలు దాన ధర్మాలు చేశారు. దాన ధర్మాలకు ప్రతీకగా నిలిచే రంజాన్ పర్వదినం వేళ నిరుపేదలకు దానంచేయడం శుభప్రదంగా ముస్లింలు భావిస్తారని, రంజాన్ పర్వదినం వేళ ఏ ఒక్క నిరుపేద ముస్లిం ఉపవాసం ఉండకూడదని ఎవరికి తోచిన విధంగా వారు సాటి వారికి సహాయం చేస్తారని పలువురు ముస్లిం పెద్దలు పేర్కొన్నారు. ప్రార్థనలు ముగించుకొని ఈద్గా నుండి బయటకు వచ్చిన ముస్లింలకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సహా పలువురు కాంగ్రెస్ నాయకులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రాథోడ్ రాము నాయక్ ఆధ్వరయంలో పలువురు బీఆర్ఎస్ నేతలు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపేందుకు ఈద్గా వద్దకు తరలివచ్చారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఖానాపూర్ సీఐ అజయ్ కుమార్, ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎస్పీ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు

నిర్మల్ కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పర్వదినం సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ ప్రాంతాల్లోని ప్రార్థన స్థలాల వద్ద ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు పవిత్ర ప్రధానాలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్, శాంతి భద్రతలు పర్యవేక్షించారు. ముస్లిం సోదరులకు రంజాన్ పండగ శుభాకాంక్షలు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఎస్పీ వెంట ఏఎస్పీలు రాజేష్ మీనా, అవినాష్ కుమార్, సీఐలు బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు.



ఈద్గా వద్ద ప్రార్థనలు



ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు

సరైన పత్రాలు లేని బియ్యం పట్టివేత

నర్సాపూర్(జి), మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బ్లూ కోర్ట్ పోలీసులు కృష్ణ, సంతోష్ ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమతి పత్రాలు లేని బియ్యం రవాణా చేస్తున్న లారీని పట్టుకున్నారు. స్థానిక ఎస్సై సాయి కిరణ్ మండల తహసీల్దార్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌కు బియ్యం రవాణా చేస్తున్న లారీలో 290 క్వింటాళ్ల బియ్యం ఏ రైస్‌మిల్లు నుండి రవాణా చేస్తున్నారో తేల్చాలని లేఖ నంబర్ 63/2025 మండల కార్యాలయానికి పంపారు. అందుబాటులో ఉన్న మండల గిర్దావర్ సుమలత, సివిలసప్లై డిటి. కార్తీక్‌రెడ్డి పోలీసుస్టేషన్‌కు వచ్చి అనుమతి పత్రాలను, బియ్యం నమూనాలు సేకరించారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన నాగోరావు

పెంబి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేణునగర్ గ్రామానికి చెందిన ఆత్రం నాగోరావు(37) విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటన వేణునగర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై హన్మాండ్లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, తెలిపిన వివరాల ప్రకారం... మందపల్లి గ్రామ శివారులో తన మొక్కజొన్న పంటకు నీళ్లు పెట్టడానికి వెళ్లాడని, మోటార్ స్టార్ట్ చేయబోయి ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. భార్య ఆత్రం సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో
గాయాలైన యువకుడి మృతి



పోతన్న (ఫైల్)

ముథోల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ధనుగరి గల్లీకి చెందిన యూరేకర్ పోతన్న(27) అనే యువకుడు నిజామా బాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మృతుడు గత రెండు రోజుల క్రితం ముథోల్‌లోని ఓ విద్యుత్ స్తంభానికి ద్విచక్ర వాహనంతో ఢీ కొట్టుకుని తీవ్ర గాయాలపాలయ్యారు. ఇతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అయితే చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

పశువుల షెడ్డు దగ్ధం



తానూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోంద్రట్ గ్రామానికి చెందిన సురేష్‌పటేల్‌కు చెందిన పశువుల షెడ్డు సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో ఇదురుగాలుల సమీపంలోని విద్యుత్ తీగలు ఒకదానికొ ఒకటి తగిలిషార్ట్‌సర్క్యూట్ ఏర్పడి షెడ్డులో ఉన్న పశుగ్రాసంతో పాటు వ్యవసాయ పనిముట్లు, స్ప్రింక్లర్ పైప్‌లు పూర్తిగా దగ్ధమైయ్యాయి. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది సంఘటన స్థలానిక చేరుకొని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ. 2లక్షల నష్టం వాటిల్లిందని కుటుంబీకులు తెలిపారు.